క్లుప్తంగా

2 నుంచి మండల పూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో జూలై 2 నుంచి సుబ్రహ్మణ్యస్వామికి మండల పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకల్యాణార్థం గణపతి, సుబ్రహ్మణ్య, ధన్వంతరి హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

గౌరవ వేతనం చెల్లించాలంటూ వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న వలంటీర్లు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఎంపీడీఓ వరప్రసాదరావుకు మంగళవారం వలంటీర్లు వినతిపత్రం అందచేశారు. గత నెలలో అన్ని చోట్లా గౌరవ వేతనం ఇచ్చారని, పోరుమామిళ్లలోని నాలుగు సచివాలయాల్లో మాత్రం వేతనం ఇవ్వలేదని వారు ఎంపీడీఓ దృష్టి తెచ్చారు. తాము రాజీనామా చేయలేదని, అయినా గౌరవ వేతనం నిలుపుదల చేయడం సబబు కాదన్నారు. తమకు వేతనం చెల్లించేలా చొరవ చూపాలని వలంటీర్లు ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ వలంటీర్లకు న్యాయం చేస్తామన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



విద్యార్థులకు మందులు వేస్తున్న డాక్టర్ మునిరాంప్రసాద్

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని హోమియో వైద్యుడు టి.మునిరాం ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాలు, గుడ్డు, ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కుర్‌కురే, పానిపూరి తదితర వాటిని తినకూడదని సూచించారు. పాఠశాలలోని 240 మంది విద్యార్థులకు డయేరియా రాకుండా ముందస్తుగా నివారణా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జె.సురేష్‌బాబు, కాంపౌండర్ నాగేశ్వరి, ఆశావర్కర్ రాణి, ఎంఎన్ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రస్తుతమున్న వైఎస్సార్ జిల్లాను 'వైఎస్సార్ కడప జిల్లా'గా మార్పు చేయాలని కోరుతూ ఏపీ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందచేశారు. కడప, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి తొలి ప్రవేశ ద్వారం కాబట్టి వేల సంవత్సరాల ఘనమైన చరిత్రను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలపై ఉందన్నారు. వైఎస్సార్ కడప జిల్లాగా మార్పు చేయడానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మేశ్వర్ కుమార్, డాక్టర్ శంకర్‌రెడ్డి, ప్రముఖ కవి జింకా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఘన సన్మానం



మోహన్ రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ప్రొద్దుటూరు : మేడా మోహన్‌రావు 1975లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారని బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదార నరేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మేడా మోహన్ రావును బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించిందన్నారు. ఆ సమయంలో మోహన్‌రావును అరెస్టు చేసి కడప జైలులో వందరోజులు ఉంచారన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ నాయకులు ఉధృతంగా పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరరావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు నల్లదిమ్ము కుమారి, నాయకులు పాతకోట రాఘవేంద్రారెడ్డి, శ్రీశ్రీ హరికృష్ణ, రవితేజ, మోతుకూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో రతనాల వెంకటేశ్వరస్వామి



ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున రతనాల వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, పూజలు చేసి అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేసి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేములమ్మా.. వర్షం కురిపించవమ్మా

మండల పరిధిలోని వేములూరు గ్రామానికి చెందిన మహిళలు వేములమ్మా వర్షం కురిపించమంటూ వేములమ్మకు బోనాలు సమర్పించారు. ఈ ఏడాది జూన్ మాసం దాటుతున్నా పదును వర్షాలు లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో వేములూరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ సమీపంలో వెలసిన వేములమ్మకు పార్టీలు, కులమతాలకు అతీతంగా వర్షాలు కురిపించాలని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– అట్లూరు



వేములమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రహమతుల్లా

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి విద్యార్థులు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని మండల అభివృద్ధి అధికారి రహమతుల్లా అన్నారు. స్థానిక స్త్రీ శక్తి కార్యాలయం వద్ద మంగళవారం నేను బడి పోతా కార్యక్రమంపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన సదసు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాలైన సౌకర్యాలు ఉండటంతో పాటు నాణ్య విద్య అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వం యంత్రాంగం వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. పిల్లలను ఇంటి వద్ద కూలి పనులకు పంపించకుండా బడిలో చేర్పించాలన్నారు. చదువుకోవటం వల్లనే కుటుంబాలలో మార్పు కనిపిస్తుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఐదేళ్ల నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గ్రామాల్లో బడి మానేసిన పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజుపాళెంలో వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని వి.రాజుపాళెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా.ఓబులేసు తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

రజక సంఘం నాయకుడి మృతికి సతాపం

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రజక సంఘం నాయకుడు ఎం.పాపయ్య (54) మంగళవారం మృతి చెందాడు. ఆయన గతంలో రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం బ్రహ్మంగారి మఠం క్షేత్రంలోని రజక అన్నదాన సత్రం ప్రతినిధిగా ఉంటున్నారు. పాపయ్య మృతదేహం వద్ద పలువురు రజక సంఘం, బీసీ సంఘం నాయకులు నివాళి అర్పించారు. ఆయన మృతి పట్ల బీసీ సంఘం నాయకులు పత్తూరు వీరభద్రుడు, నాయని పెద్దన్న తదితరులు సంతాపం తెలిపారు.

గడ్డమాయపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం



రైతులకు మందులను పంపిణీ చేస్తున్న డీడీ శ్రీనివాసులు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లెలో మంగళవారం రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో జమ్మలమడుగు పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 30 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేశారు. 139 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. 65 కోళ్లకు కొక్కెర తెగులు నివారణ మందును పంపిణీ చేశారు. 22 గేదెలకు గర్భనిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. 8 మంది పశువైద్య సహాయకులకు శిక్షణ ఇచ్చారు. శిబిరంలో పశువుల యజమానులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో మైదుకూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు జి.సుమన్ కుమార్, పశువైద్యులు గురివిరెడ్డి, ఆర్.సుధాకర్, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ ప్రకాష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అమీర్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులకు వినతి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం విజయవాడలో మంత్రులు నారా లోకేష్, గుమ్మడి సంధ్యారాణిలకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) నాయకులు వినతి పత్రాలు అందజేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 42 రోజులు సమ్మె చేసినప్పుడు శిబిరాల వద్దకు మంత్రి లోకేష్ వచ్చి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రులు చెప్పినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి



ఉర్దూ పాఠశాల ఆవరణలో నిరసన తెలియజేస్తున్న ఆవాజ్ నాయకులు, విద్యార్థులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మహబూబ్‌నగర్ వీధిలోని ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల లేని కారణంగా ఎంతో మంది ఉర్దూ మీడియం పది పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం కడప, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. గతంలో అనేక దఫాలు సమస్యను విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఏ మాత్రం ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని, లేనిపక్షంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ.సత్తార్, పట్టణ నాయకులు మస్తాన్, రసూల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.మహబూబ్‌బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచాయతీలో అవినీతిని డీఎల్ నిరూపించాలి

ఖాజీపేట : ఖాజీపేట మేజర్ పంచాయతీలో అవినీతి జరిగినట్లు ఆరోపిస్తున్న మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి వాటిని నిరూపించాలని ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఖాజీపేట ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి సుధామణి సవాల్ విసిరారు. మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖాజీపేట మేజర్ పంచాయతీలో గడిచిన మూడు సంవత్సరాల్లో రూ.80 లక్షల అభివృద్ధి పనులు జరిగిన మాట నిజమే అన్నారు. అందులో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. గతంలో ఖాజీపేట మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా, మండలాధ్యక్షురాలుగా డీఎల్ సుభద్రమ్మ పని చేసిందని, అప్పటి నుంచి జరిగిన పనులపై ఖాజీపేట బస్టాండ్‌లో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. పుల్లూరు పంచాయతీలో మాజీ సర్పంచ్ వీరారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డిలు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సొంత స్థలం దానంగా ఇచ్చారని గుర్తు చేశారు. అలాంటి వారిని పంచాయతీకి వస్తే సహించమని అధికారులను బెదిరించడం ఎమిటని ప్రశ్నించారు. ఇలాంటి దౌర్జన్యాలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అరికట్టాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : ప్రస్తుత కాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. మంగళవారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో, గాంధీనగర్, శ్రీకృష్ణదేవరాయనగర్ సచివాలయాల్లో వైద్య సిబ్బందితో వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, డయేరియా నివారణకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జూలై 1వ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు జరగనున్న డయేరియా నివారణ మాసోత్సవాల్లో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నీట్'పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు : నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. మంగళవారం నీట్ ఫలితాలపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై దేశమంతా స్పందిస్తుంటే టీడీపీ, జనసేన పార్టీల నాయకులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై అనేక అనుమానాలు, అభ్యంతరాలు ఉన్నాయన్నారు. ఇది దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశమని, పూర్తి స్థాయిలో విచారణ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దు చేసి అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



రాజుపాళెం గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రాజుపాళెం : ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ప్రతాపుడు పేర్కొన్నారు. మంగళవారం రాజుపాళెంలోని గ్రంథాలయానికి ప్రొద్దుటూరు మిడ్ టౌన్ రోటరీ క్లబ్ తరఫున 75 పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రతాపుడు మాట్లాడుతూ గ్రంథాలయానికి సహకారం అందించినందుకు మిడ్ టౌన్ రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. క్లబ్ ప్రెసిడెంట్ బి.కిరణ్, సెక్రటరీ ఎ.తుకారం. సీనియర్ రోటేరియన్ యు.స్వామి శేఖర్, యు.తిరుపతయ్య, ఎం.దేవరాయలు చేతుల మీదుగా పుస్తకాలను అందించారు.

పేదల భూములపై దౌర్జన్యం మానుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బ్రహ్మంగారిమఠం : పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములపై టీడీపీ నాయకుల దౌర్జన్యం మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని సోమిరెడ్డిపల్లె రెవెన్యూ పొలం పరిధిలోని చీటిపాయిలో గత పదేళ్లుగా మామిడి, చీని మొక్కలు నాటుకుని పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లో చౌదరివారిపల్లెకు చెందిన కొంత మంది టీడీపీ నాయకులు దౌర్జన్యంగా సాగు చేసుకున్న మొక్కలను పెరికేశారన్నారు. అసైన్డ్ భూములు స్థానిక నిరుపేదల కుటుంబాలకు మాత్రమే హక్కు ఉంటుందన్నారు. వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పేదలు పొలాల్లో సాగు చేసుకునేందుకు వెళితే పోలీసుల చేత కేసులు పెట్టిస్తున్నారని, టీడీపీ ప్రభుత్వం మీద గంపెడు ఆశలు పెట్టుకున్న పేదలపైన ఆ పార్టీ నాయకులు బెదిరింపులకు దిగడం శోచనీయమన్నారు. మైదుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన పుట్టా సుధాకర్ యాదవ్ పేదల ఇబ్బందులను పట్టించుకుని తమ అనుచరులు చేస్తున్న ఆగడాలను అరికట్టాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. కార్యక్రమంలోవ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బమ్మ, గోవిందు, గండి సునీల్ కుమార్, వెంకటరామిరెడ్డి, నరసింహా, రాహుల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి



ఎంఈఓ పద్మలతకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌యూ నాయకులు

మైదుకూరు : మైదుకూరులో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ (ఏఐఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు మంగళవారం ఎంఈఓటీఎం పద్మలతకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అనుమతులు లేని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకుని వాటి గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని పాఠశాలలు రోజురోజుకి విస్తరిస్తున్నాయన్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల దీపాలు వెలిగించారు. తెల్లవారుజామున పంచామృతాభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించారు. సాయంత్రం 3 గంటల అనంతరం ఆలయ ఆవరణలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహాలకు పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కల్యాణ వైభోగమే!



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



భక్తులకు మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించిన అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితో పాటు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇటీవలే మూడు రోజులపాటు ఆలయ చరిత్రలో తొలిసారిగా సహస్ర కలశాభిషేకాలు నిర్వహించారు. ఆ రోజు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు రాలేకపోయిన వారు కల్యాణం రోజున దర్శించుకోవడం పుణ్యదాయకమని భావించి విశేష సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.